వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 013
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
డిసెంబర్ 16, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## మావోయిస్టు అగ్రనేత దామోదర్ అరెస్ట్

- పోలీసుల అదుపులో ఆయనతో పాటు మరో 15 మంది
- డీజీపీ కార్యాలయానికి తరలింపు

8లో..



# నాయినీ.. నాన్చొద్దు..!



పెండింగ్ పనుల పరిష్కారానికి కేరాఫ్ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి. ప్రజల అవసరాలకోసం ఎంతదాకైనా సై అనే మనస్తత్వం ఆయనది. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలకు ఆయన పరిష్కార మార్గం చూపించారు. తేనె తుట్టె లాంటి డబుల్ బెడ్ రూం ఇళ్లతోపాటు నయీంనగర్ బ్రిడ్జి, భద్రకాళి మాడవీధుల సమస్యను చాకచక్యంగా పరిష్కరించారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిననాటి నుంచి ఎక్కడ సమస్య ఉంటే అక్కడ తానున్నానంటూ వచ్చి దానికి పరిష్కారమార్గం చూపించి ప్రజల చేత శభాష్ అనిపించుకుంటున్న 'నాయిని' బుద్ధభవన్ రోడ్డు విస్తరణలో మాత్రం నాన్చి వేత ధోరణి ప్రదర్శించడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. కేవలం నాలుగు కుటుంబాలకోసం నాన్చితే వేలాది మందికి దూరమవుతారంటూ హితవు పలుకుతున్నారు. దశాబ్దకాలం క్రితమే రోడ్డు విస్తరణ పనులకు లైన్ క్లియర్ అయినప్పటికీ నేటికీ పూర్తి కాకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారంలో లెజెండ్ గా గుర్తింపు పొందిన నాయిని రాజేందర్ రెడ్డి చొరవతోనే న్యూ బస్టాండ్ నుంచి బుద్ధభవన్ మీదుగా గోపాల్ రావు బిల్డింగ్ వరకు రోడ్డు విస్తరణ జరుగుతుందన్న ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇది పూర్తి చేస్తే ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారంటున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

- పెండింగ్ లో బుద్ధభవన్ రోడ్డు విస్తరణ
- దశాబ్దకాలం క్రితమే రూ.2 కోట్ల కేటాయింపు
- ఎమ్మెల్యేపైనే స్థానికుల ఆశలు
- నాలుగు కుటుంబాల కోసం నాన్చితే వేలాది మందికి దూరమవుతారంటూ హితవు
- అభివృద్ధి పనుల్లో దూసుకుపోతున్నారంటూ కితాబు
- పనులు పూర్తి చేసి జనహృదయ నేతగా నిలవాలంటూ ఆకాంక్ష

వివరాలు2లో..

## మేడారానికి మెరుగైన రవాణా సౌకర్యం

- టీఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి
- కలెక్టర్ తో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష



8లో..

2లో..



## 'కల్పలత'లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

- బినామీ జీతాలు, డీజిల్ అక్రమాలపై ఆరా

## లాస్ట్ వార్

### తుదిపోరుకు అంతా సిద్ధం

- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు



8లో..

# నాయినీ.. నాన్చొద్దు..!



- పెండింగ్ లో బుద్ధభవన్ రోడ్డు విస్తరణ
- దశాబ్దకాలం క్రితమే రూ.2 కోట్ల కేటాయింపు
- ఎమ్మెల్యేపైనే స్థానికుల ఆశలు
- నాలుగు కుటుంబాలకోసం నాన్చితే వేలాది మందికి దూరమవుతారంటూ హితవు
- అభివృద్ధి పనుల్లో దూసుకుపోతున్నారంటూ కితాబు
- పనులు పూర్తి చేసి జనహృదయ నేతగా నిలవాలంటూ ఆకాంక్ష

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** నగరం నలువైపులా విస్తరిస్తోంది. కొత్తకొత్త కాలనీలు పుట్టుకొస్తున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారుల విస్తరణ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు నిత్య కృత్యంగా మారుతున్నాయి. ట్రాఫిక్ ఇక్కట్లనుంచి బయటపడేందుకు రహదారుల విస్తరణ తప్పనిసరి. అయితే హనుమకొండ నగరం నడిబొడ్డున ఉన్న బుద్ధభవన్ రోడ్డు విస్తరణకు దశాబ్దకాలం క్రితమే ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినా నేటికీ పనులు ప్రారంభించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. హనుమకొండలోని కాంగ్రెస్ భవన్ నుంచి కాకతీయ యూనివర్సిటీ బైపాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డు వేసేందుకు పదేళ్ల క్రితం సీఎం నిధుల నుంచి సుమారు రూ.2 కోట్లు కేటాయించినట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. అయితే రాజకీయ గ్రహణం, నిధులు విడుల కాకపోవడంతో విస్తరణ పనుల ప్రతిపాదనలు ప్రకటనలకే పరిమితమైంది.

### నాయిని మీదే ఆశలు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే బుద్ధభవన్ రోడ్డు విస్తరణపై స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేసిన ప్రకటనపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే రెండేళ్ల ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన నాయిని హనుమకొండ న్యూ బస్టాండ్ నుంచి బుద్ధభవన్ మీదుగా విస్తరించాల్సిన రోడ్డును విస్మరించడం తగదంటున్నారు. నయీంనగర్ బ్రిడ్జి, భద్రకాళి మాడవీధులు, డబుల్ బెడ్ రూం ఇళ్లకు శాశ్వత పరిష్కారం చూపించిన నాయిని బుద్ధభవన్ రోడ్డును తక్షణం వెడల్పు చేసి బీటీ వేయాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం నలుగురైదుగురి మెప్పుకోసం ఈ రోడ్డును నాన్చడంపైప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు కుటుంబాలకోసం నాన్చితే వేలాది మందికి దూరమవుతారంటూ హితవు పలుకుతున్నారు.

### ట్రాఫిక్ జామ్..

బుద్ధభవన్ రోడ్డులోనే జిల్లా కాంగ్రెస్ పార్టీ భవనం ఉన్నందున నిత్యం ట్రాఫిక్ జామ్ తో ఇబ్బందులు తప్పడం లేదు. పార్టీ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించినప్పుడు ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. సాధారణంగా ఈ రహదారిలో వాహనాల రాకపోకలు ఎక్కువగానే ఉంటాయి. దీనికితోడు జిల్లా కాంగ్రెస్ భవన్ ప్రధాన గేటును ఆనుకొని ఉన్న ట్రాన్స్ ఫార్మర్ కూడా ట్రాఫిక్ సమస్యలకు కారణంగా మారుతోంది. అయితే ఇటీవల జరిగిన వరంగల్ మహా నగర మాస్టర్ ప్లాన్ పై నిర్వహించిన సమీక్షలో బుద్ధభవన్ రహదారి విస్తరణపై ప్రణాళికలు రూపొందించినట్లు ప్రచారం జరిగింది. కుడా ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలోనూ కాంగ్రెస్ భవన్ నుంచి బుద్ధభవన్ మీదుగా కేయూ బైపాస్ రోడ్డుకు చేరుకునేలా 40 ఫీట్ల రోడ్డు నిర్మించేందుకు అధికారులు ఆమోదం తెలిపినట్లు చర్చ జరిగింది.

### జనహృదయ నేతగా నిలవాలి..

హనుమకొండ కొత్త బస్టాండ్ నుంచి బుద్ధభవన్ మీదుగా గోపాల్ రావు బిల్డింగ్ వరకు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు వెడల్పు చేసి బీటీ వేస్తే ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. నాలుగు కుటుంబాలకోసం నాన్చితే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంది. రోడ్డు విస్తరణ పూర్తి కాకుంటే వేలాది మంది పశ్చిమ ఓటర్లు నాయినికి దూరమయ్యే అవకాశం ఉంది. ప్రజల మనిషిగా పేరుగాంచిన 'నాయిని' దవాబ్దకాలంగా పెండింగ్ లో ఉన్న బుద్ధభవన్ రహదారిని విస్తరిస్తే జనం హృదయాల్లో చిలిచిపోతారు. అంతే కాకుండా జిల్లా కాంగ్రెస్ పార్టీ భవనానికి కూడా మంచి లుక్ వస్తుంది. అయితే రహదారి విస్తరణకు నాయిని ప్రత్యేక చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.












## 'కల్పలత'లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

- బినామీ జీతాలు, డీజిల్ అక్రమాలపై ఆరా

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ జిల్లాలోని 'ది కో ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ – కల్పలత సూపర్ బజార్' కార్యాలయంలో భారీ స్థాయిలో ఆర్థిక అక్రమాలు, కుంభకోణం జరిగినట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన కల్పలత కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయానికి వెళ్లగానే సిబ్బంది లేకపోవడంపై ఎమ్మెల్యే నాయిని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రిజిస్టర్‌లో ఏడుగురు సిబ్బంది ఉన్నప్పటికీ, కేవలం ఇద్దరు మాత్రమే విధుల్లో ఉండటంపై ఆయన ధ్వజమెత్తారు. వెంటనే రికార్డులు, రిజిస్టర్లు, జమ ఖర్చులకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు. కో ఆపరేటివ్ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంక్‌లో దాదాపు 10 మంది సిబ్బంది పేరుతో నెలకు రూ.10,000 చొప్పున జీతాలు తీసుకుంటున్నట్లు గుర్తించారు. అయితే, జీతాల రిజిస్టర్‌లో వారి సంతకాలు లేవు. కల్పలత పాలకమండలి సభ్యులు తమ స్వప్రయోజనాల కోసం గడిచిన మూడేళ్లుగా సంస్థ నిధుల నుంచి డీజిల్, పెట్రోల్‌ను వాడుకున్నారు. దీనికి ఎటువంటి అధికారిక అనుమతులు లేవని, ఆ డీజిల్ డబ్బులు కూడా తిరిగి చెల్లించలేదని తేలింది. గత పాలకుల చేతిలో కీలుబొమ్మల్లా వ్యవహరిస్తూ.. సభ్యత్వ నమోదు ప్రక్రియలో పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలు జరిగాయి. సభ్యత్వ రుసుము మొత్తాన్ని పక్కదారి పట్టించారని, దీనికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టమైంది. తనిఖీల అనంతరం





ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. చాలా రోజులుగా కల్పలత సూపర్ బజార్‌లో అవకతవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. "కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏ రంగంలోనూ అవినీతి జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇక్కడ జరిగిన కుంభకోణంపై వెంటనే విచారణ చేపట్టాలని అధికారులను కోరారు. వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి రికార్డులు, రిజిస్టర్లను జప్తు చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని పరిస్థితిని వివరించారు. ఈ పాలకమండలిని సత్వరమే రద్దు చేసి, సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్, ఆర్డీఓలకు ఆయన సూచించారు. సొసైటీ ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# గతంలో కంటే మెరుగైన అభివృద్ధి

■ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గడిచిన పదేళ్లలో కంటే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మెరుగైన అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రతి కాలనీ అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఎమ్మెల్యే నాయిని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా 54వ డివిజన్, శ్రీనగర్ కాలనీ వద్ద రూ.2 కోట్లతో మంచి నీటి పైప్ లైన్ ఏర్పాటుకు, 9వ డివిజన్, కాకతీయ కాలనీలో రూ.47 లక్షలతో సైడ్ డ్రైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు 54వ డివిజన్‌ను ప్రత్యేకంగా దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మంచి నీటి సరఫరా కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులు ప్రారంభించడం సంతోషకరమన్నారు. ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, గత పదేళ్లుగా జరుగని పనులను గడిచిన రెండేళ్లలోనే పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వానికి సహకరిస్తే రానున్న రోజుల్లో నూరు శాతం పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నగరంలో పార్కు స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే నాయిని స్పష్టం చేశారు. గడిచిన రెండేళ్లుగా నగరంలో కబ్జాలు చాలా వరకు తగ్గాయని, ఎవరైనా కబ్జాలకు పాల్పడితే వారు ఎంతటి వారైనా సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు గుంటి రజిత శ్రీనివాస్, చీకటి శారద ఆనంద్, డివిజన్ అధ్యక్షులు నల్ల సత్యనారాయణ, ఎండీ జాఫర్, కాలనీ ప్రజలు, కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కేటీపీపీలో విద్యుత్ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవం



**వరంగల్ వాయిస్, గణపురం (చెల్పూర్):** గణపురం మండలం చెల్పూర్ వద్ద ఉన్న కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ)లో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (H-58) రీజినల్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ వ్యవస్థాపకులు, గౌరవ అధ్యక్షులు కోడూరి ప్రకాష్, జెన్కో అధ్యక్షులు ఎలకంటి రఘోత్తం ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.2026-2027 సంవత్సరానికి ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం అధ్యక్షులుగా లింగంపెల్లి రాజేశ్వర్ రావు, కార్యనిర్వహక అధ్యక్షులుగా మామిండ్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి సూర నరేందర్, రీజినల్ కోశాధికారిగా నడిపెల్లి మాధవరావు, ఉపాధ్యక్షులు, అదనపు కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ప్రచార కార్యదర్శులుగా, కార్యవర్గ సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు కోడూరి ప్రకాష్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం నూతన కమిటీ కృషి చేయాలని సూచించారు. జెన్కోలోని అన్ని స్టేషన్లలో కొత్త పోస్టుల కోసం ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగం నుంచి జూనియర్ అసిస్టెంట్ కన్వర్షన్ కోరకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడానికి యాజమాన్యంతో మరొక్కసారి చర్చిస్తామని తెలిపారు. రాబోయే పీఆర్సీలో విద్యుత్ ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీని సాధించుకునేందుకు గట్టిగా ప్రయత్నం చేస్తామని ఆయన ప్రకటించారు. అధికారులకు పరిచయంసమావేశానంతరం అతిథులను, నూతన రీజినల్ కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రీజినల్ బాడీ సభ్యులను ఇంచార్జి చీఫ్ ఇంజనీర్ ఐవీఎల్ కోటేశ్వరరావుకి, అన్ని విభాగాల సూపరింటెండెంట్ ఇంజనీర్లకు, విజిలెన్స్ అండ్ ఫాక్టరీ మేనేజర్ తాడూరి రఘుపతికి, డివిజనల్ ఇంజనీర్ (అడ్మినిస్ట్రేషన్) జి.ఇందిరలకు పరిచయం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జెన్కో కార్యదర్శి ముత్యాల రాంబాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టపాక కిరణ్, ఉపాధ్యక్షులు బుర్ర కుమారస్వామి, జెన్కో వర్కింగ్ ప్రెసిడెంట్ కె.కాంతయ్య, సహాయ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, తోట మల్లిక్, లక్కం విజేందర్, తాల్ల శ్రీనివాస్, తీగల తిరుపతి రావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రైల్వే జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం

◆ 21న అయోధ్యపురంలో నిర్వహణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కాజీపేటలో నిర్మాణంలో ఉన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ (ఆర్ఎంయూ) కోసం భూములు కోల్పోయిన అయోధ్యపురం గ్రామ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రైల్వే జేఏసీ కీలక నిర్ణయం తీసుకుంది. నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21 ఆదివారం ఉదయం 10 గంటలకు అయోధ్యపురంలో "రౌండ్ టేబుల్" సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జేఏసీ ప్రకటించింది. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల మద్దతు కూడగట్టేందుకు తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు మంగళవారం ఆహ్వానాలు అందజేశారు. తెలంగాణ రైల్వే జేఏసీ ప్రతినిధులు హనుమకొండ జిల్లా కార్యాలయాలలో సీపీఎం, సీపీఐ నాయకులను కలిసి సమావేశానికి ఆహ్వానించారు. సీపీఎం జిల్లా నాయకులు ఎం.చుక్కయ్య, బోట్ల చక్రపాణి, రగుల రమేష్, టి.ఉప్పలయ్య, భానునాయక్, జి.ప్రభాకర్ రెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.దీప, సీపీఐ జిల్లా కార్యాలయంలో నాయకులను, వీసీకే పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా.జీలుకర శ్రీనివాస్, జాతీయ ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, టీజేఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు చిల్లా రాజేందర్ ప్రసాద్, హన్మకొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష – కార్యదర్శులు: పులి సత్యం, కొత్త రవి, తదితర ప్రజా సంఘాల నాయకులను కూడా జేఏసీ ప్రతినిధులు కలిసి ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగారావు, కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, అయోధ్యపురం గ్రామ మాజీ సర్పంచ్ గాదం యాదగిరి, గ్రామ ప్రజలు ఇలా సాగరం ప్రదీప్ కుమార్, ఉప్పు వెంకటేష్, దుప్పెల్లి తేజ, సజనపు రవికిరణ్, కంగుల రాజేందర్ తదితరులు పాల్గొంటున్నట్లు కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ తెలియజేశారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల పట్టణ మున్సిపల్ పరిధిలోని సీఎస్ఐ కాలనీ, 2వ వార్డుకు చెందిన మడికొండ రత్నాకర్ (పంచాయతీ కార్యదర్శి) తల్లి మడికొండ పుష్ప అనారోగ్యంతో నిన్న మరణించారు. మంగళవారం వారి పార్థివ దేహాన్ని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ సందర్శించారు. పుష్ప భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్, మడికొండ సుధాకర్, బొచ్చు కరుణాకర్, బొచ్చు జెమిని, మడికొండ చెంగల్ రావు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర పద్మశాలి విశ్రాంతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం (టీఎస్పీయూఎస్)కు అనుబంధంగా పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర పద్మశాలి విశ్రాంతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ అధికారిక ప్రకటన వెలువడింది. ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా బాసబత్తిని రాజేశంను, ప్రధాన కార్యదర్శిగా చౌటు భూమేశ్వర్ ని నియమిస్తూ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర వ్యవస్థాగత కార్యదర్శి శిరాందాస్ యాదగిరేందర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తిరందాస్ యాదగిరి నూతనంగా నియమించబడిన కార్యవర్గాన్ని అభినందించారు. విశ్రాంతి పద్మశాలి ఉద్యోగులందరూ పరస్పరం సహకరించుకుంటూ సంఘటితంగా ముందుకు సాగాలని, సమాజ సేవలో పాల్గొంటూ, పద్మశాలి సమాజ అభివృద్ధికి పాటుపడాలని వారు కోరారు. తమను తెలంగాణ రాష్ట్ర పద్మశాలి విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు బాసబత్తిని రాజేశం, చౌటు భూమేశ్వర్ పద్మశాలి ఉద్యోగుల సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజ అభివృద్ధికి, పద్మశాలి విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమం కోసం తమ శక్తి మేరకు తప్పకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి హామీ ఇచ్చారు.

# బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణానికి చెందిన కొలుగూరి సరోజన భర్త, దివంగత కొలుగూరి రాజేశ్వరరావుకు బంధన్ బ్యాంక్ నుంచి ఆర్థిక భరోసా లభించింది. ఆరు నెలల క్రితం చిరు వ్యాపారం కోసం రాజేశ్వరరావు బంధన్ బ్యాంక్ పరకాల బ్రాంచ్‌లో రూ.50 వేల రుణం తీసుకున్నారు. ఈ రుణం తీసుకునే సమయంలో ఆయన రూ.లక్ష విలువైన బీమా సౌకర్యాన్ని కూడా పొందారు. అయితే, దురదృష్టవశాత్తూ రెండు నెలల క్రితం రాజేశ్వరరావు మృతి చెందారు. ఈ నేపథ్యంలో, బీమా నిబంధనల ప్రకారం... బంధన్ బ్యాంక్ ద్వారా రూ.లక్ష బీమా మొత్తానికి సంబంధించిన చెక్కును సోమవారం కొలుగూరి సరోజనకు బ్యాంక్ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల బ్రాంచ్ మేనేజర్ బానోతు నరేష్, ఏరియా మేనేజర్ బాధవత్ శ్రీను, ఏజెంట్ మాలోతు అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ ప్రతినిధులు మాట్లాడుతూ బీమా సౌకర్యం ద్వారా కుటుంబానికి తగిన ఆర్థిక భరోసా లభించిందని, చిరు వ్యాపారాలు చేసుకునే వారు రుణం తీసుకునేటప్పుడు తప్పనిసరిగా బీమా సౌకర్యాన్ని కూడా పొందాలని సూచించారు.

# వాగ్దేవి ఫార్మసీ ఫలితాల విడుదల

### ఎం.ఫార్మసీలో 94 శాతం ఉత్తీర్ణత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాంనగర్‌లోని వాగ్దేవి ఫార్మసీ కళాశాల (అటానమస్) విద్యార్థులు పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారు. కళాశాలలో నిర్వహించిన బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఫార్మ్-డి పరీక్షా ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. బీఫార్మసీ, ఎంఫార్మసీ రెండో సెమిస్టర్, ఫార్మ్-డి మొదటి సంవత్సరం పరీక్షలకు గాను మొత్తం 158 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 134 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఎం.ఫార్మసీలో అత్యధికంగా 94 శాతం, ఫార్మ్-డిలో 91 శాతం, బీఫార్మసీలో 78 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన తెలిపారు. నాణ్యమైన విద్యే విజయానికి కారణం ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అధ్యాపకుల సమర్థవంతమైన బోధన, విద్యార్థుల క్రమశిక్షణతో కూడిన కృషి, కళాశాలలోని విద్యా వాతావరణం వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించినందుకు పరీక్షల నియంత్రణాధికారి డా. డి. కుమారస్వామి, అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించింది.

# బీఆర్ఎస్ నుంచి కుసుమ శరత్ బాబు, చంద్రమౌళి బహిష్కరణ

### ఆదేశాలు జారీ చేసిన పార్టీ అధిష్టానం



**వరంగల్ వాయిస్, శాయంపేట:** భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించడం, నమ్మకద్రోహం, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు గాను శాయంపేట మండల కేంద్రానికి చెందిన ఇద్దరు నాయకులపై వేటు పడింది. వల్లపదాసు చంద్రమౌళి, కుసుమ శరత్ బాబులను బీఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరించినట్లు మంగళవారం పార్టీ కార్యాలయంలో గంగుల మనోహర్ రెడ్డి తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ బహిష్కరణ చర్య తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, గాజె రాజేందర్, కరణ్ బాబు, శాయంపేట మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు మారేపల్లి మోహన్, ఉప సర్పంచ్ సుమన్, గణేష్, ప్రభాకర్, రంగు మహేందర్, చంద్రమొగిలి తదితరులు పాల్గొన్నారు.

# ప్రలోభాలకు లొంగకుండా ఓటేయండి

### సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బుధవారం జరగనున్న మూడో విడత పంచాయతీ ఎన్నికలలో ఓటర్లు కీలకపాత్ర పోషించాలని సామాజికవేత్త, ఓటరు చైతన్య పోరాట యోధుడు నిమ్మల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, గ్రామ అభివృద్ధికి నిబద్ధతతో పాటుపడే అభ్యర్థులను మాత్రమే తమ అమూల్యమైన ఓటు ద్వారా ఎన్నుకోవాలని ఆయన కోరారు. నిజాయితీ, సమర్థత ఉన్న నాయకులను ఎన్నుకోవడం ద్వారానే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ తాను నిర్వహించిన 'ఓటరు చైతన్య కార్యక్రమానికి' సహకరించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు, ఆయా సంస్థల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. "తాను నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా కొందరు పాల్గొన్నప్పటికీ, ఆ కార్యక్రమ వార్తలను ఎప్పటికప్పుడు తమ వార్తా పత్రికలు, మాధ్యమాల ద్వారా ప్రచురించి, పరోక్షంగా ప్రజలలో విస్తృత అవగాహన కల్పించిన రిపోర్టర్లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని నిమ్మల శ్రీనివాస్ అన్నారు.

# ఎలక్షన్ డ్యూటీకి 'డుమ్మా'

- డోర్నకల్‌లో కొందరు సిబ్బంది గైర్హాజరు
- రిజర్వ్ సిబ్బందిని వినియోగించిన అధికారులు




**వరంగల్ వాయిస్, డోర్నకల్:** మూడవ విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో కొందరు ఎన్నికల సిబ్బంది తమ విధులకు హాజరుకాకుండా దుమ్మా పెట్టారు. దీంతో డోర్నకల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అధికారులు కాసేపు హైరానా పడ్డారు. ఎన్నికలు సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు అత్యంత కీలకమైన ప్రిసైడింగ్ అధికారులు (పీఓ) మరియు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఓపీఓ)లు ఇప్పటికే రెండు విడతలుగా తప్పనిసరి శిక్షణ తీసుకున్నారు. అయితే, చివరి రోజున ఎన్నికల సామగ్రిని తీసుకుని విధులకు హాజరు కావాల్సిన సమయంలో కొందరు సిబ్బంది వివిధ కారణాలు చూపి డ్యూటీలకు హాజరు కాలేదు. ఎన్నికల సిబ్బంది గైర్హాజరు కావడంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లోని హెల్ప్ డెస్క్ వద్ద కాసేపు కోలాహలం నెలకొంది. ఈ పరిస్థితిని అధికారులు అప్రమత్తంగా పర్యవేక్షించారు. విధులకు హాజరుకాని సిబ్బంది స్థానంలో వెంటనే రిజర్వ్‌లో ఉంచిన సిబ్బందిని వినియోగించి ఎన్నికల ప్రక్రియకు అంతరాయం లేకుండా చూశారు. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీనివాస్ వివరణ కోరగా, "రిజర్వ్ స్టాఫ్‌ను వినియోగించి పోలింగ్ కేంద్రాలకు పంపాము. విధులకు హాజరు కాని సిబ్బంది వివరాలను ఎలక్షన్ ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారిపై నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కోరతాం" అని తెలిపారు.

# "మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి"

### ముస్త్యాలపల్లి సర్పంచ్ అభ్యర్థి వెంకటేష్



**వరంగల్ వాయిస్, నడికుడ:** పరకాల నియోజకవర్గం, నడికూడ మండలం, ముస్త్యాలపల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో మేక మల్ల వెంకటేష్ (బ్యాట్ గుర్తు) దూసుకుపోతున్నారు. ఎల్.ఎల్.బీ. పూర్తి చేసిన ఉన్నత విద్యావంతుడైన వెంకటేష్, తనదైన వినూత్న మేనిఫెస్టోతో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు. గ్రామంలోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ముందుండే వెంకటేష్‌పై గ్రామ ప్రజల్లో బలమైన నమ్మకం ఏర్పడింది. ముఖ్యంగా యువత, మహిళల నుంచి ఆయనకు సంపూర్ణ మద్దతు లభిస్తోంది. "తమ మధ్యనే ఉంటూ, సమస్యలపై స్పందించే గుణం ఉన్న వెంకటేష్ గెలుపు ఖాయమని" గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. వెంకటేష్ గ్రామ అభివృద్ధి కోసం ఒక ప్రత్యేక ప్రణాళికను ప్రకటించారు. దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టేందుకు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రతి నెలా గ్రామ సభలు నిర్వహించడం ద్వారా అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, మహిళా సంఘ భవనం నిర్మాణానికి కృషి చేసి, మహిళల ఆర్థిక శక్తికి తోడ్పాటు, పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యత, ఫిర్యాదుల పరిష్కారం: పారదర్శక పాలన కోసం ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు ద్వారా సంబంధిత అధికారులతో సమస్యల పరిష్కారం, గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేసి యువతలో ఆదర్శాన్ని పెంపొందించడం, పాలనలో ప్రజల భాగస్వామ్యం ద్వారా నిధుల దుర్వినియోగానికి తావులేకుండా చూస్తానని హామీలు ఇచ్చారు. "గ్రామానికి సేవ చేయడాన్ని బాధ్యతగా భావించి మీ ముందుకు వచ్చాను. నేను స్థానికంగా ఉండి, నిత్యం ప్రజల మధ్య ఉంటాను. మౌలిక వసతులు కల్పించి ప్రజలు ఆనందంగా ఉండేందుకు కృషి చేస్తాను" అని వెంకటేష్ పేర్కొన్నారు. ఈ నెల 17న జరగబోయే సర్పంచ్ ఎన్నికలలో బ్యాట్ గుర్తుపై ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మేక మల్ల వెంకటేష్ ముస్త్యాలపల్లి గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

### ధర్మారం సర్పంచ్ అభ్యర్థి బాషిక ఎల్ల స్వామి



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని ధర్మారం గ్రామ సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ మద్దతు గల అభ్యర్థి బాషిక ఎల్ల స్వామి దూసుకెళ్తున్నారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు, యువత, మహిళలు, వృద్ధులతో మమేకమవుతూ ఆయన తనదైన శైలిలో ప్రచారాన్ని ఉధృతం చేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో గ్రామ సేవకుడిగా తాను ముందుకు వస్తున్నానని బాషిక ఎల్ల స్వామి తెలిపారు. "నేను మీ ఇంటి బిడ్డగా వస్తున్నాను. మీ కష్టసుఖాలలో పాలుపంచుకుంటా. ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేసి, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాను" అని ఆయన హామీ ఇచ్చారు. గతంలో పాలన చేసిన నాయకులు గ్రామాన్ని దోచుకున్నారని, మరోసారి దోచుకోవడానికి మళ్లీ ముందుకు వచ్చారని ఆయన ధ్వజమెత్తారు. "మాకు ఈసారి అవకాశం ఇస్తే అహర్నిశలు కష్టపడతా. మీ అందరి సహకారంతో సమిష్టిగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం" అని ఎల్ల స్వామి విజ్ఞప్తి చేశారు. తమపై గ్రామ ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని, అభివృద్ధిలో మార్పును చూపిస్తానని ఆయన స్పష్టం చేశారు. కేవలం మాటలతో కాకుండా, పనులతో నిలబడే నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, పారదర్శక సేవలే తన ప్రధాన లక్ష్యాలని తెలిపారు. ఇంకా పరిష్కారంకాని అనేక సమస్యలు, ప్రాథమిక సదుపాయాల మెరుగుదలకు తాను ముందుండి పోరాడతానని ఆయన భరోసా ఇచ్చారు. "ప్రజలు నన్ను ఆశీర్వదించి, ఉంగరం గుర్తుకు అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుకుంటున్నాను. గ్రామాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్తాను" అని బాషిక ఎల్ల స్వామి విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థికి ప్రజల మద్దతు లభిస్తుండడంతో ఆయన గెలుపు దిశగా దూసుకెళ్తున్నట్లు సమాచారం.

# పెరిక కులస్తులు శాసించే స్థాయికి ఎదగాలి

### ■ జిల్లా అధ్యక్షుడు అల్లం రాజేశ్ వర్మ



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** పెరిక కులస్తులు రాజకీయాలలో చురుకుగా రాణించి, కేవలం అభ్యర్థించే స్థాయిలోనే కాకుండా, శాసించే స్థాయికి ఎదగాలని తెలంగాణ పెరిక కుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు అల్లం రాజేశ్ వర్మ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా, గీసుకొండ మండలం, మచ్చాపూర్ గ్రామ సర్పంచ్‌గా వరుసగా మూడోసారి భారీ విజయం సాధించిన బొడకుంట్ల ప్రకాశ్ – మానస దంపతులకు మంగళవారం మచ్చాపూర్‌లో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లం రాజేశ్ వర్మ మాట్లాడుతూ... కులాభివృద్ధి కోసం పెరిక కులస్తుల్లో రాజకీయ చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. దేశానికి ప్రధానమంత్రి, రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎంత ముఖ్యమో, గ్రామానికి సర్పంచ్ పదవి కూడా అంతే ప్రాముఖ్యమని ఆయన పేర్కొన్నారు. వరుసగా మూడోసారి గెలిచిన బొడకుంట్ల ప్రకాశ్ – మానస దంపతులను ఆయన అభినందించారు. మాజీ సర్పంచ్ అంకతి నాగేశ్వర రావు మాట్లాడుతూ అందరికీ తలలో నాలుకలా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడమే బొడకుంట్ల ప్రకాశ్ విజయానికి ప్రధాన కారణమన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చాపూర్ మాజీ సర్పంచ్, కుల పెద్దలు నరిశెట్టి నరేందర్, వనపర్తి ధర్మరాజు, పత్తిపాక నారాయణ, పత్తిపాక లింగమూర్తి, తిప్పని శ్రీశైలం, అర్సం యాకయ్య, చింతం రాజుకుమార్, మేడిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ‘ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలి’

■ కేయూ వీసీ ప్రొ.ప్రతాప్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కే.యూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) గోల్డెన్ జూబ్లీ (స్వర్ణోత్సవ) వేడుకలలో భాగంగా, తెలుగు విభాగం, విద్యార్థి వ్యవహారాల విభాగం (డీన్) సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమం “తెలంగాణ చరిత్రలో ప్రజా ఉద్యమాలు (1969–2025)” అనే అంశంపై దృష్టి సారిస్తుంది. తెలంగాణ ఉద్యమాల చరిత్ర, వాటి సామాజిక, రాజకీయ, సాంస్కృతిక ప్రభావాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం, ప్రజా చైతన్యాన్ని మరింతగా బలపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.జనవరి 8 స్ఫూర్తితో..1969 జనవరి 8న తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన చారిత్రక సందర్భాన్ని స్మరించుకుంటూ ఈ కార్యక్రమం కేయూ స్వర్ణోత్సవ వేడుకలకు ప్రత్యేకతను జోడిస్తుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 6, 2026ఉదయం 10:00 గంటలకువ్యాసరచన పోటీలు, జనవరి 7, 2026 ఉదయం 10:00 గంటలకు ఉపన్యాస (వక్తృత్వ) పోటీలు, జనవరి 8, 2026 బహుమతుల ప్రదానం, ముగింపు కార్యక్రమం ఉంటుందని, ఈ పోటీల్లో కేయూ పరిధిలోని అన్ని కళాశాలల విద్యార్థులు, అలాగే పీజీ విద్యార్థులు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. పాల్గొనదలచిన విద్యార్థులు తమ పేర్లను జనవరి 3, 2026 లోపు నమోదు చేసుకోవాలి. నమోదు కోసం కేయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రో.ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రో. రామచంద్రం, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రో.మామిడాల ఇస్తారి, తెలుగు విభాగాధిపతి డా.మామిడి లింగయ్య, డా.చిర్ర రాజు, పాలక మండలి సభ్యులు, డా.కర్రె సదాశివుడు, డా.స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు. కేయూ స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా ఈ కార్యక్రమం విద్యార్థులకు తెలంగాణ ప్రజా ఉద్యమాల చరిత్రను చేరువ చేసే ఒక చారిత్రక వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# వీసీ, రిజిస్ట్రార్ ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం కలిసి నేడు విశ్వవిద్యాలయ మహిళా ఇంజనీరింగ్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంలో భాగంగా వారు కళాశాలలోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతుల నిర్వహణ, ప్రయోగశాలల (ల్యాబ్‌ల) స్థితిగతులు, గ్రంథాలయం (లైబ్రరీ), అధ్యాపకుల బోధనా విధానాలు, ఇతర మౌలిక వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, వైస్ ఛాన్సలర్ విద్యార్థినులతో ప్రత్యేకంగా ముచ్చటించి, కళాశాల వాతావరణం, బోధన నాణ్యతపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.భిక్షాలు వైస్ ఛాన్సలర్‌తో పాటు ఉన్నారు.

# పంథినిలో బీజేపీ విజయకేతనం

**నూతన సర్పంచ్, వార్డు మెంబర్లకు వన్నాల అభినందనలు**



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట:** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట నియోజకవర్గంలోని పంథిని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా విజేతలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ మంగళవారం ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. పంథిని గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన శ్రీరామ్ భూపాల్ (కన్నయ్య)తో పాటు, గెలుపొందిన వార్డు మెంబర్లకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సర్పంచ్, వార్డు మెంబర్లను డాక్టర్ వన్నాల వెంకట రమణ శాలువాలతో సన్మానించారు. అనంతరం వన్నాల వెంకట రమణ మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగించిందని, రెండో విడతలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పార్టీ విజయకేతనం ఎగురవేసిందని పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి నాయకులు అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించడంలో పార్టీ సఫలమైందని తెలిపారు. దీనికి అభ్యర్థుల చరిష్మా కూడా తోడైందని ఆయన వెల్లడించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతోనే గ్రామాల్లో సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ ప్రాబల్యం మరింత పెరగడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.


# జాతీయ స్థాయిలో కృతిక ప్రియా చందన్ ప్రతిభ

■ రాక్ క్లైంబింగ్, 2875 మీటర్ల ట్రెకింగ్‌లో సత్తా



**వరంగల్ వాయిస్, కే.యూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ విమెన్ (కేయూసీఈటీడబ్ల్యూ) కు చెందిన బీ.టెక్ ఫైనల్ ఇయర్ సీఎస్ఎం విద్యార్థిని, ఎన్ఎస్ఎస్ వలంటీర్ కుమారి కృతిక ప్రియా చందన్ వేంగల జాతీయస్థాయిలో మరో గొప్ప విజయాన్ని సాధించారు. ఆమె నవంబర్ 18 నుంచి 27 వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల, మెక్లియాడ్‌గంజ్‌లో గల అటల్ బిహారీ వాజపేయా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్ నిర్వహించిన ఎన్ఎస్ఎస్ నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ – 2025ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ 10 రోజుల శిక్షణా శిబిరంలో కృతిక సహజ రాక్ క్లైంబింగ్, కృత్రిమ రాక్ క్లైంబింగ్,రాపెల్లింగ్,రివర్ క్రాసింగ్,డబుల్ జుమారింగ్, 2875 మీటర్ల ఎత్తులోని ట్రియుండ్ పర్వత ట్రెక్కింగ్, భగ్సునాగ్ జలపాతం ట్రెక్కింగ్ లలో అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. నాట్-మేకింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ క్లాసులు, పర్యావరణ పరిరక్షణ, సురక్షిత ట్రెక్కింగ్ నియమాలు పాటిస్తూ ముందుకు సాగింది. గోవా, కాశ్మీర్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మొత్తం 70 మంది పాల్గొనువారిలో, కృతిక ప్రియా చందన్ తన శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సాంస్కృతిక ప్రాతినిధ్యం వంటి అంశాల్లో ప్రత్యేక గుర్తింపును సాధించారు. శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ఆర్.ఎం.సీ ధర్మశాల అధిపతి ఆమెకు అడ్వెంచర్ క్యాంప్ బ్యాడ్జ్‌ను ప్రదానం చేశారు. కృతిక ప్రియా చందన్ విజయం ఎన్ఎస్ఎస్ యువసేవకులకు ఆదర్శప్రాయమని, “నాట్ మీ, బట్ యూ” అనే ఎన్ఎస్ఎస్ సేవా భావాన్ని ఆమె తన ప్రవర్తనతో ప్రతిఫలించిందని కళాశాల యాజమాన్యం ప్రశంసించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు, కళాశాల అకాడమీ కోఆర్డినేటర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ అర్చన, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారులు వెంకటేష్ తూర్పాటి, రచన, కళాశాల సూపరింటెండెంట్ వీరు నాయక్, అధ్యాపకులు, విద్యార్థినులు కృతికకు అభినందనలు తెలిపారు.





# నడికూడలో దూసుకుపోతున్న చందు



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దురిశెట్టి చంద్రమౌళి (చందు) గెలుపు దిశగా దూసుకెళ్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలను ఉద్దేశించి ఉద్వేగభరితమైన విజ్ఞప్తి చేశారు. “గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నడికూడ గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని, ప్రత్యర్థుల మాయమాటలు నమ్మకుండా తన ఫుట్‌బాల్ గుర్తుపై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని” చంద్రమౌళి పిలుపునిచ్చారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నడికూడ మండల అధ్యక్షుడిగా సేవలందిస్తున్న దురిశెట్టి చంద్రమౌళి... ప్రతి ఒక్కరికి ఆపద సమయంలో ‘అన్నా అంటే నేనున్నా’ అంటూ అండగా ఉంటూ, ఎంత పెద్ద సమస్య అయినా పరిష్కారం చేస్తూ నడికూడ ప్రజల మన్ననలను పొందారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామంలోని ప్రతి ఇంటికి అందించడంలో కృషి చేశానని ఈ సందర్భంగా తెలిపారు. 14 వార్డుల మాదిరిగా గ్రామంలోని ప్రతి ఇంటికి సేవ చేస్తానని, తనను నిండు మనసుతో ఆశీర్వదించి ఫుట్‌బాల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని దురిశెట్టి చంద్రమౌళి నడికూడ గ్రామస్తులను కోరారు.

# ప్రపంచ ఐక్యత, స్నేహమే ‘ఇస్కఫ్’ లక్ష్యం

■ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** సమాజంలో భిన్న సంస్కృతులు, భాషలు, ఆచారాలు కలిగిన ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడం, అలాగే భారతదేశంతో స్నేహ సంబంధాలు కలిగి ఉండే ప్రపంచ దేశాల మధ్య స్నేహభావాన్ని బలోపేతం చేయడమే ఇండియన్ కల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ (ఇస్కఫ్) ప్రధాన లక్ష్యమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం హనుమకొండలో ఇస్కఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఆధునిక యుగంలో చిరునవ్వు పలకరింపు, స్నేహభావం కొరవడుతున్నాయని పేర్కొన్నారు. ఇస్కఫ్ ఆర్గనైజేషన్ ద్వారా దేశాల మధ్య, సంస్కృతుల మధ్య, భిన్న భాషలు, మతాల మధ్య సామరస్యాన్ని, స్నేహాన్ని పెంపొందింపజేసి విశ్వ మానవ కళ్యాణం కొరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు అనంతరం జరగబోయే ముఖ్యమైన మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ నెల 19న హనుమకొండ జిల్లా ఇస్కఫ్ మహాసభను, జనవరి 18న హైదరాబాద్‌లో జరుగు ఇస్కఫ్ రాష్ట్ర మహాసభను, జనవరి 30, 31న చెన్నైలో జరుగు ఇండియన్ కల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ జాతీయ మహాసభలను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఇస్కఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నేదునూరి రాజమౌళి, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, ఇస్కఫ్ సమన్వయ కార్యదర్శి దొమ్మాటి ప్రవీణ్ కుమార్, నవ చైతన్య బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, ఉస్మాన్ పాషా, సూర్యం వెంకటేశ్వర్లు, నగరబోయిన కావేరి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట:** బుధవారం జరగనున్న మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను పటిష్టంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా ఎన్నికల అబ్జర్వర్ శివకుమార్, సీపీ (కమిషనర్ ఆఫ్ పోలీస్) ప్రీతం సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం శాయంపేట మండల కేంద్రంలో ఎన్నికల సిబ్బందితో వారు సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు సిబ్బందికి పలు ముఖ్య సూచనలు చేశారు. ఎన్నికల సామాగ్రిని, చెక్‌లిస్ట్ ప్రకారం క్షుణంగా తనిఖీ చేసుకోవాలి. ఏ లోపాలూ లేకుండా చూసుకోవాలి. ఏవైనా సమస్యలు ఎదురైతే తక్షణమే సంబంధిత రూట్ అధికారులకు తెలియజేయాలి. బుధవారం జరిగే ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు ఇచ్చిన అన్ని సూచనలు పాటించాలని కోరారు.

# శ్రీ ఎర్రగట్టు వెంకన్న హుండీల లెక్కింపు

## ఆదాయం రూ. 1,32,740



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఒకటవ డివిజన్ ఎర్రగట్టులో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను లెక్కించగా, మొత్తం రూ. 1,32,740 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమం దేవాదాయ శాఖ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అనిల్, ఆలయ ఈవో వెంకట్రావు, ఆలయ చైర్మన్ వెంకటస్వామి పర్యవేక్షణలో జరిగింది. రాజరాజేశ్వరి సేవా సమితి మహిళా సభ్యులు హుండీ కానుకలను లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి, జన్ను రవీందర్, మిగుళ్ల సురేష్, ఆలయ సిబ్బంది శ్రీనివాస్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# కూరుకుపోయిన చతుర్ముఖ లింగం, నంది విగ్రహం

## పునఃప్రతిష్టాపన చేయాలని మంత్రి సురేఖకు వినతి



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** మధ్య కోటలోని స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భూమిలో కూరుకుపోయిన చారిత్రక చతుర్ముఖ లింగం, నంది విగ్రహాన్ని వెలికితీసి, వాటికి పునఃప్రతిష్టాపన చేయాలని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకి వినతిపత్రం సమర్పించడం జరిగింది. రాష్ట్రీయ హిందూ వరంగల్ జిల్లా అధ్యక్షులు మడిపెల్లి నాగరాజు గౌడ్ మంగళవారం మంత్రిని కలిసి ఈ వినతి పత్రాన్ని అందజేశారు. నాగరాజు గౌడ్ మాట్లాడుతూ, శంభు లింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సగభాగం వరకు భూమిలో కూరుకుపోయిన ఈ పురావస్తు సంపదను వెంటనే వెలికి తీయడం ద్వారా ఆలయ ప్రాశస్త్యం పెరుగుతుందని తెలిపారు. ఈ సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, పునఃప్రతిష్టాపన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన మంత్రివర్యులను కోరారు. మంత్రి కొండా సురేఖ సమస్య పరిష్కారం విషయంలో సానుకూలంగా స్పందించినట్లు మడిపెల్లి నాగరాజు గౌడ్ తెలియజేశారు.

# పైసా పంచకుండా రమ్య గెలుపు దేశానికే ఆదర్శం

## ● డాక్టర్ వన్నాల వెంకట రమణ



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మండలంలోని కట్రియాల గ్రామ సర్పంచ్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థిని, విద్యావంతురాలైన ఎస్టీ మహిళ రాయపురం రమ్య సాధించిన విజయం రాష్ట్రానికే కాకుండా, దేశానికే ఆదర్శంగా నిలిచిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ కొనియాడారు. జన్ సంఘ్ ఆవిర్భావం నుంచి వర్ధన్నపేట నియోజకవర్గం బీజేపీకి కంచుకోటగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గతంలో ఇక్కడ నుండి వన్నాల శ్రీరాములు, తక్కలపల్లి రాజేశ్వర రావు ఎమ్మెల్యేలుగా గెలుపొందారని, కట్రియాల గ్రామంలో కూడా గుజ్జ యాదగిరి రెడ్డి సర్పంచ్ గా పనిచేశారని తెలిపారు. అయితే, మధ్యకాలంలో క్యాడర్ బలంగా ఉన్నప్పటికీ వివిధ కారణాల వల్ల ఆశించిన విజయాలు దక్కలేదన్నారు. కానీ, ప్రస్తుత పంచాయతీ ఎన్నికలలో ఎస్టీ రిజర్వ్ అయిన కట్రియాల స్థానంలో రాయపురం రమ్య పోటీ చేసి నూతన అధ్యాయానికి తెరలేపారని డాక్టర్ వన్నాల అన్నారు. సర్పంచ్ రమ్య ఎన్నికల ప్రచార సరళిని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఓటుకు నోటు పంపిణీ చేసే దుష్ట సంప్రదాయాన్ని పక్కనపెట్టి, ఒక్క రూపాయి కూడా ఓటరుకు ఇవ్వకుండా ఆమె ప్రచారం నిర్వహించారు. యువత మద్దతుతో ఇంటింటికీ తిరిగి, ప్రధాని నరేంద్ర మోదీ దేశ హితం కోసం, గ్రామీణ అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. తనను గెలిపిస్తే కట్రియాలను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని, ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని మాట ఇచ్చారు. మరోవైపు ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మద్యం, డబ్బులు విచ్చలవిడిగా పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నం చేశాయని ఆరోపించారు. అయినప్పటికీ, ప్రజలు ప్రధాని మోదీ అభివృద్ధి పథకాలపై, రమ్య నిజాయితీపై నమ్మకం ఉంచి ఆమెను గెలిపించారని తెలిపారు. ప్రత్యర్థుల ధనబలాన్ని అధిగమించి రమ్య సాధించిన ఈ విజయం యావత్ ప్రజాస్వామ్య చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తితో, సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చిన రమ్యకు అండగా నిలిచిన గ్రామ యువతకు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓటు వేసిన ప్రజలకు డాక్టర్ వన్నాల వెంకట రమణ పాదాభివందనాలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం ప్రధాని మోదీ పేద ప్రజల పట్ల చూపిస్తున్న ప్రేమకు, ఆయన ఆశయాలకు నిదర్శనమని పేర్కొన్నారు.

# న్యాయవాదుల రాష్ట్ర సదస్సుకు తరలిరండి

## ■ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సామాజిక న్యాయం, న్యాయవాదుల హక్కులు మరియు రక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్పీఏ) 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసేందుకు హనుమకొండ జిల్లా న్యాయవాదులు పెద్ద ఎత్తున తరలి వెళ్లాలని హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ నెల 20న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరగనున్న ఐఎల్పీఏ 5వ రాష్ట్ర సదస్సు గోడపత్రికలను మంగళవారం హనుమకొండ జిల్లా కోర్టు ఆవరణలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. సమాజంలోని అన్ని వర్గాలకు రక్షణ చట్టాలు ఉన్నప్పటికీ, ప్రజల హక్కుల కోసం నిరంతరం వాదించే న్యాయవాదులకు రక్షణ చట్టం లేకపోవడం శోచనీయం అని పులి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. 80 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఇంకా అసమానతల సమాజం కొనసాగడం బాధాకరమన్నారు. రాజ్యాంగాన్ని అధ్యయనం చేసిన ఉన్నత విద్యావంతులైన న్యాయవాదులు చైతన్యం చెందడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని తెలిపారు. మహిళా సమానత్వం, అన్ని వర్గాలకు సమన్యాయం కోసం పాటుపడుతున్న ఐఎల్పీఏ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఎల్పీఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయిని నరేందర్ మాట్లాడుతూ పూలే, అంబేద్కర్ సిద్ధాంతాల పునాదులపై పనిచేస్తున్న ఐఎల్పీఏ) మెజారిటీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని తెలిపారు. సామాజిక న్యాయం కోసం కోర్టుల్లో వాదించే న్యాయశాఖలో 'రూల్ ఆఫ్ రిజర్వేషన్' లేకపోవడం వల్ల అణగారిన వర్గాల వారు అత్యున్నత స్థాయికి ఎదగడానికి అవకాశం లేకుండా పోయిందని అన్నారు. సామాజిక చైతన్యం ద్వారానే బహుజన సమాజాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయవచ్చని, ఈ పోరాటంలో న్యాయవాదులు కలిసిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నెల 20న కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర సదస్సులో రాజ్యాంగ విలువలు – ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ ప్రజల హక్కులు, ఈడబ్ల్యూఎస్‌కు లేని నిబంధన ఓబీసీలకు ఎందుకు?, మహిళా కోటాలో బహుజన కోటా, న్యాయవాద రక్షణ చట్టం అనే నాలుగు అంశాలపై చర్చ జరగనుంది. ఈ సదస్సుకి మాజీ హైకోర్టు న్యాయమూర్తి, మాజీ జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. విశిష్ట అతిథులుగా కొత్తగూడెం జిల్లా జడ్జి పాటిల్ వసంత్, అదనపు జిల్లా జడ్జి ఎస్.సరిత, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, ఐఎల్పీఏ జాతీయ అధ్యక్షులు సుజాత కె.చౌదంటే, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, కర్ణాటక సీనియర్ న్యాయవాది ఎస్.బాలన్, సుభాస్ చంద్రబోస్, డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు గౌరవ అతిథులుగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎల్పీఏ రాష్ట్ర నాయకులు చిల్ల రాజేంద్రప్రసాద్, మల్లెల భాస్కర్, హనుమకొండ జిల్లా కన్వీనర్ ముచ్చు రాజేందర్, హనుమకొండ బార్ కన్వీనర్ పూసపెల్లి శ్రీనివాస్, మరియు న్యాయవాదులు సిరబోయిన శ్రీనివాస్, చింత సాంబశివరావు, సూరం నరసింహ, అంబేద్కర్, కవిత, చింత నిఖిల్, శివకుమార్ యాదవ్, ఎగ్గడి సుందర్ రామ్, రమేష్, పూస రవీందర్, రామకృష్ణ, గంధం శివ, అనిల్, రాచకొండ ప్రవీణ్ కుమార్, అక్రమ్, కొంగర సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో కుక్కల స్వైర విహారం

## ■ ఎనిమిది మందిని కరిచిన పిచ్చి కుక్క
## ■ బాధితులను పరామర్శించిన కార్పొరేటర్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ మహానగరపాలక సంస్థ (డబ్ల్యూజీఎంసీ) పరిధిలోని 40వ డివిజన్‌లో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్న నేపథ్యంలో, డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి మున్సిపల్ జంతు వైద్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావును కలిసి తరచుగా కుక్కలను పట్టుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో ఉన్న కుక్కలను పట్టుకెళ్లే సిబ్బంది పనితీరును కార్పొరేటర్ మరుపల్ల రవి, మున్సిపల్ జంతు వైద్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావుతో కలిసి స్వయంగా పరిశీలించారు. గత ఆది, సోమవారాల్లో ఏకంగా ఎనిమిది మందిని పిచ్చికుక్క కరిచి గాయపరిచిన కారణంగా, ఇకముందు కుక్కలు కరవకుండా మున్సిపల్ సిబ్బంది వాటిని పట్టుకెళ్లారు. వరంగల్ మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఒక్కరోజే 8 కుక్కలను పట్టుకెళ్లడం జరిగింది. కుక్కలను పట్టుకెళ్లిన సిబ్బందిలో జవాన్ ఆదామ్, గొర్రె రాజు, ఆదామ్‌లు ఉన్నారు. అనంతరం, మున్సిపల్ జంతు వైద్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు గారు కార్పొరేటర్ మరుపల్ల రవితో కలిసి ఇటీవల పిచ్చికుక్క కాటుకు గాయపడిన వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి, తప్పనిసరిగా డాక్టర్ల సూచన మేరకు వైద్యం పొందాలని, గాయపడిన వారి పూర్తి వివరాలను కమీషనర్ దృష్టికి తీసుకువస్తానని డా.గోపాలరావు హామీ ఇచ్చారు.



# నా పెళ్లిపై అసత్య ప్రచారాలెందుకు?

### నటి మెహరిన్ ఘాటు వ్యాఖ్యలు

తన పెళ్లి వార్తలపై అసత్య కథనాలపై నటి మెహరిన్ తీవ్రంగా స్పందించారు. తన పెళ్లంటూ ఆర్టికల్ రాసిన ఓ మీడియా సంస్థపై నటి మెహరీన్ అసహనం వ్యక్తంచేశారు. గత రెండేళ్లుగా ఇలాంటి వ్యవహారాలపై మౌనంగా ఉన్నా, ఇప్పుడు మాట్లాడక తప్పడం లేదన్నారు. నేను ఎవరినీ వివాహం చేసుకోలేదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ప్రపంచానికి చెబుతా.. అంతేగానీ తన పెళ్లి గురించి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. హరియాణాకు చెందిన భవ్యా బిష్ణోయ్‌తో మెహరీన్ నిశ్చితార్థం జరిగినా అనివార్య కారణాల వల్ల పెళ్లి రద్దు అయింది. 2022లో వచ్చిన 'ఎఫ్ 3' తర్వాత ఆమె నటించిన తెలుగు సినిమా 'స్పార్క్'. కోలీవుడ్‌లోనూ ఒక్క సినిమాలోనే (ఇంద్ర) నటించారు. ప్రస్తుతం కన్నడలో ఓ చిత్రం చేస్తున్నారు. కెరీర్‌లో గ్యాప్‌పై ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. గ్యాప్ కావాలని తీసుకోలేదని, 'ఎఫ్ 3' తర్వాత చేసిన 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ' వెబ్‌సిరీస్ కోసం ఎక్కువ సమయం కేటాయించానని తెలిపారు.




## రౌడీ జనార్ధన్‌గా వస్తున్న విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రవికిరణ్ కోల దర్శకత్వంలో 'రౌడీ జనార్దన్' పేరుతో ఓ చిత్రం రూపొందుతోంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. కీర్తి సురేశ్ కథానాయిక. ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న సంగతి తెలిసిందే. ఈనెల 18న దిల్‌రాజు పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించి విజయ్ డబ్బింగ్ పూర్తి చేసినట్లు తెలిసింది. ఇది కోనసీమ నేపథ్యంలో సాగే పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. దీంట్లో ఓ అందమైన ప్రేమకథ మిళితమై ఉంటుంది. విజయ్ ఈ సినిమాలో మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో అలరించనున్నారు.

## శిల్పాశెట్టి బాస్టియన్ రెస్టారెంట్‌పై కేసు

బాలీవుడ్ నటి శిల్పా శెట్టికి చెందిన ప్రముఖ రెస్టారెంట్ 'బాస్టియన్' బెంగళూరులో మరో వివాదంలో చిక్కుకుంది. అనుమతించిన సమయం కంటే ఎక్కువసేపు కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, అర్ధరాత్రి పార్టీలకు అనుమతించి నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను బెంగళూరు పోలీసులు ఈ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. సెయింట్ మార్క్స్ రోడ్‌లో ఉన్న 'బాస్టియన్' రెస్టారెంట్ డిసెంబర్ 11న రాత్రి 1.30 గంటల వరకు కార్యకలాపాలు కొనసాగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇది పోలీసులు ఇచ్చిన సమయానికంటే ఎక్కువ సేపు నిర్వహించినట్లు సమాచారం. దీంతో కర్ణాటక పోలీస్ చట్టంలోని సెక్షన్ 103 కింద సుమోటో ఫిర్యాదుల ఆధారంగా కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు మేనేజర్‌లు, ఇతర సిబ్బందిపై కేసులు నమోదు అయ్యాయి. 'బాస్టియన్'తో పాటు, రెసిడెన్సీ రోడ్‌లో ఉన్న 'సౌర్ బెర్రీ పబ్' పై కూడా కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తులో భాగంగా పబ్ సిబ్బందితో సహా ఎనిమిది మంది వాంగ్మూలాలను పోలీసులు రికార్డు చేశారు.



## ఓజీ విజయంతో పవన్ ఖుషీ

### డైరెక్టర్ సుజిత్‌కు కారు బహుకరణ

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు చాలా రోజుల తర్వాత బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. చాలా రోజుల తర్వాత పవన్‌కి ఓజీ రూపంలో బ్లాక్ బస్టర్ రావడంతో ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. అయితే 'ఓజీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం.. నటుడు పవన్ కళ్యాణ్ చిత్ర దర్శకుడు సుజిత్ కు అద్భుతమైన బహుమతిని అందించారు. 'ఓజీ' సాధించిన అద్భుత విజయానికి సంతోషించిన పవన్ కళ్యాణ్, దర్శకుడు సుజిత్‌కు లగ్జరీ కారు ని బహుమతిగా ఇచ్చారు. ప్రముఖ కార్ల కంపెనీ లాండ్ రోవర్‌కి చెందిన రేంజ్ రోవర్ లగ్జరీ కారుని సుజిత్‌కి గిఫ్ట్‌గా ఇచ్చాడు. కాగా ఈ విషయాన్ని సుజిత్ ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. నేను అందుకున్న బహుమతుల్లో ఇది అత్యుత్తమమైనది. మాటల్లో చెప్పలేనంత ఆనందంగా, కృతజ్ఞతతో నిండిపోయాను. నా అత్యంత ప్రియమైన ఓజీ, కళ్యాణ్ గారి నుండి లభించిన ఈ ప్రేమ, ప్రోత్సాహం నాకు అన్నిటికంటే ముఖ్యం. చిన్ననాటి నుంచి ఆయన అభిమానిగా మొదలై ఈ ప్రత్యేక క్షణం వరకు? ఇది నిజంగా అద్భుతం. జీవితంలో ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటాను'. అంటూ సుజిత్ రాసుకోచ్చాడు.





## శివ రాజ్‌కుమార్, ఉపేంద్రల మల్టీస్టారర్ చిత్రం 45

కన్నడ అగ్ర నటులు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ చిత్రం '45'. ఈ సినిమా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, ఉపేంద్రతో పాటు రాజ్ బి. శెట్టి కూడా ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. ఈ సినిమా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. సినిమా విభిన్నమైన కథాంశంతో, ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ కు అధిక ప్రాధాన్యం ఇస్తూ రూపొందినట్టు స్పష్టమవుతోంది. ఉపేంద్ర తన గత చిత్రాల మాదిరిగానే ఇందులోనూ ఒక డిఫరెంట్, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రం డిసెంబరు 25న క్రిస్మస్ కానుకగా విడుదల కానుండగా తెలుగు ప్రేక్షకుల కోసం ఈ చిత్రాన్ని వారం ఆలస్యంగా, జనవరి 1న కొత్త సంవత్సరం కానుకగా విడుదల చేయనున్నారు.

# మేడారానికి మెరుగైన రవాణా సౌకర్యం

- టీఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి
- కలెక్టర్ తో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష





**వరంగల్ వాయిస్, ములుగు :** శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం, అధిక బస్సులను ఏర్పాటు చేయడమే లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి ఆయన సందర్శించారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యాల దృష్ట్యా మేడారం ఆర్టీసీ బస్ స్టాండ్, బస్సుల ప్రాంగణం, ప్రయాణికులు వేచి ఉండే ప్రదేశాలు, శుభ్రత, తాగునీటి సౌకర్యాలు తదితర ఏర్పాట్లకు సంబందించిన ప్రణాళికను పరిశీలించి ఆర్టీసీ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడుతూ.. మేడారం జాతర కోసం 28 ఎకరాల సువిశాల ప్రదేశంలో బస్టాండ్ ఏర్పాటు, క్యూలైన్స్, భక్తులు వేచి ఉండే గదులు, తదితర నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి ఒకటవ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. విధుల్లో డ్రైవర్లు, కండక్టర్లు, టెక్నికల్ అధికారులు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలిగించకుండా మెరుగైన రవాణా సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం ములుగు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గత జాతరలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మేడారం వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం, బస్సుల ఏర్పాటు విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు. తాడ్వాయి నుంచి మేడారం చేరుకునే అటవీ మార్గం మధ్యలో సిగ్నల్ సమస్య ఉండటంతో కమ్యూనికేషన్ కోసం ప్రతి కిలోమీటర్ కు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అనంతరం శ్రీ సమ్మక్క సారమ్మ వన దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, ఆర్టీసీ ఈడిఎం మునిశేఖర్, ఈడీలు వెంకన్న, సాల్మన్, ఆర్ఎంలు విజయ భాను, రవి చంద్ర, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# లాస్ట్ వార్ తుదిపోరుకు అంతా సిద్ధం

- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు



**వరంగల్ వాయిస్, వరంగల్/హనుమకొండ/డోర్నకల్ :** గ్రామ పంచాయతీ మూడో విడత ఎన్నికలకు సర్వం సిద్ధం అయింది. 17వ తేదీ ఉదయం 7 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగనుంది. మధ్యాహ్నం 2 గంటలనుంచి కౌంటింగ్ ఫలితాల వెల్లడి జరుగుతుంది. ఇదే రోజు ఉప సర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహించనున్నారు.

## వరంగల్ లో..

మూడో విడత ఎన్నికల నేపథ్యంలో నర్సంపేట, ఖానాపూర్, చెన్నారావుపేట, నెక్కొండ మండలాల్లో జరగనున్న పోలింగ్‌కు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, పోలింగ్ సామగ్రి పంపిణీ, బ్యాలెట్ బ్యాక్స్ లకు సీల్, లాజిస్టిక్స్ నిర్వహణ, ఎన్నికల సిబ్బంది కేటాయింపు, భద్రతా చర్యలు తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. పోలింగ్ రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమర్థవంతమైన, పారదర్శకమైన, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి స్థాయిలో ఖచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న లోపం కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన బ్యాలెట్ పేపర్లు, ఎన్నికల సామగ్రి, సీలింగ్ మెటీరియల్, రవాణా ఏర్పాట్లు, సిబ్బంది క పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, సుమా, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, డీబీసీడీఓ పుష్పలత, డీఎస్ సీడీఓ భాగ్యలక్ష్మి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.



## హనుమకొండలో..

హనుమకొండ జిల్లాలో మూడో విడత ఎన్నికలు బుధవారం హనుమకొండ జిల్లాలోని ఆత్మకూర్, దామెర, నడికూడ, శాయంపేట మండలాల్లో జరుగుతుండగా ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. సర్పంచ్, వార్డు స్థానాలకు పోలింగ్ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆత్మకూర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ లో..

మహబూబాబాద్ జిల్లాలోని ఆరు మండలాల్లో ఎన్నికల బ్యాలెట్, సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్లలో సిబ్బందికి అందించారు. మండల కేంద్రంలో నుంచి గ్రామాలలోని పోలింగ్ స్టేషన్ చేరకోవాటానికి వివిధ రూట్ లలో బస్సులను ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారులు, జోనల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన విధులలో అప్రమత్తంగా, జాగ్రత్తగా, వ్యవహరించాలని సూచన మేరకు ఈ ఎన్నికలు జరుగనున్నాయి. అయితే మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు మహబూబాబాద్ జిల్లా ఎస్పి డాక్టర్ శబరీష్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యం లో 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్ ) అమల్లో ఉంటుందన్నారు. పోలింగ్ నిర్వహణకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

# మావోయిస్టు అగ్రనేత దామోదర్ అరెస్ట్

- పోలీసుల అదుపులో ఆయనతో పాటు మరో 15 మంది
- డీజీపీ కార్యాలయానికి తరలింపు

**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** గత కొంతకాలంగా స్తబ్దతగా ఉన్న ములుగు ఏజెన్సీ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మావోయిస్టు పార్టీ అగ్రనేతల్లో ఒకరైన ములుగు జిల్లా తాడ్వాయి సమ్మక్క సారలమ్మ మండలం కల్వపల్లి గ్రామానికి చెందిన మావోయిస్ట్ అగ్రనేత, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కా రావు అలియాస్ దామోదర్ పోలీసులకు చిక్కారు. ఆదిలాబాద్ నుంచి సేఫ్ జోన్ కు వెళుతుండగా పోలీసులకు చిక్కినట్లు సమాచారం పట్టుబడ్డ దామోదర్ తో పాటు 15 మంది మావోయిస్టులు సిర్పూర్ (యు) లో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. పట్టుబడ్డ వారిలో 9మంది మహిళలు ఏడుగురు పురుషులు ఉండగా మావోయిస్టులను హైదరాబాద్ డీజిపి కార్యాలయానికి తరలించారు. దీంతో మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలినట్లు అయింది. ఇప్పటికే హిడ్మా ఎన్ కౌంటర్ తో పాటు ఆపరేషన్ కగార్ కార్యక్రమంలో భాగంగా అనేకమంది మావోయిస్టులు లొంగిపోవడంతో పార్టీ బలహీన పడినట్లు అయింది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ చీఫ్ తిప్పరి తిరుపతితో పాటు అగ్ర నేతలైన బర్సి దేవా, దామోదర్, దేవాలు తాము ఉన్నట్లు తమ ఉనికిని చాటుతూ మావోయిస్టు పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్న సమయంలో దామోదర్ తోపాటు మరో 15 మంది సభ్యులు అదిలాబాద్ జిల్లాలో పోలీసులకు చిక్కడంతో తెలంగాణలో సైతం మావోయిస్టు పార్టీకి కోలుకొని దెబ్బ పడినట్లు తెలుస్తోంది. పోలీసులకు చిక్కిన నామాలతో పాటు 15 మంది సభ్యులను తెలంగాణ రాష్ట్ర డిజిపి కార్యాలయానికి పోలీసులు తరలించినట్లు సమాచారం. అయితే నిన్న రాత్రే వీరిని పట్టుకున్నట్లు తెలుస్తోంది. గతంలో ప్రజలను ఇబ్బంది పెడుతున్న నగరంలో రౌడీ షీటర్లు, భూ మాఫియా దారులను హెచ్చరిస్తూ లేఖలు విడుదల చేసింది మావోయిస్టు అప్పటి కేకేడబ్ల్యూ కార్యదర్శి దామోదర్ గా చెప్పుకుంటున్నారు. అయితే 2025 జనవరి 16న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామిడ్–ఉసూర్ అడవుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో దామోదర్ తో పాటు ఇతర మావోయిస్టులు మృతి చెందినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే కొద్దీ రోజులకే దామోదర్ పేరున లేఖ విడుదల చేశారు. దామోదర్ కు వరంగల్ నగరంలో మంచి పట్టు ఉంది.



# కార్మిక భవనం నిర్మించాలి

- కార్మికులకు మిల్లు భూమిలోనే స్థలం కేటాయించాలి
- వివిధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** ఆజం జాహీ మిల్లు కార్మిక భవనం కూల్చి ఒక సంవత్సరం అయిన సందర్భంగా కూల్చివేసిన ఆజం జాహీ మిల్లు స్థలంలోనే నూతన కార్మిక భవనం నిర్మించాలని, 318 మంది కార్మికులకు మిల్లు భూమిలోనే 200 గజాల ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ అన్ని పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, విప్లవ సంఘాలు, హక్కుల సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐఎఫ్టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఇట్టి సమావేశంలో వచ్చే 2026 మార్చి 31 వరకు ప్రభుత్వపరంగా నూతన భవనం నిర్మించాలని, లేకుంటే ఏప్రిల్ 1వ తేదీన కార్మిక భవన నిర్మాణానికి పునాది తీయడం జరుగుతుందని తీర్మానించారు. అలాగే 318 మంది కార్మికులకు ఆజాంజాహీ మిల్లు భూమిలోనే 200 గజాల స్థలం ప్రభుత్వము వెంటనే ఇవ్వాలని ధర్నాలో కోరారు. పలువురి గంభీరమైన ఉపన్యాసాలతో సభ వేడెక్కింది. ఈ క్రమంలో భవన నిర్మాణం భూమి పూజకు అఖిలపక్ష నాయకులు గంగుల దయాకర్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, నన్నపనేని నరేందర్, నల్గొండ రమేష్ కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నుంచి నల్గొండ రమేష్, బీజేపీ నుంచి మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు టి.నాగేశ్వరావు, వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, ఆరూరి రమేష్, బీఆర్ఎస్ నుంచి నన్నపనేని నరేందర్ పాల్గొన్నారు. నన్నపనేని నరేందర్ భూమి పూజ తన వంతుగా ఒక లక్ష రూపాయలు అలాగే బీజేపీ నుంచి ఎర్రబెల్లి ప్రదీప్ రావు రెండు లక్షలు విరాళం ఇస్తామని ప్రకటించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com